## వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# 'దళితబంధు' వెలుగు నీడలు..!



బుద్దా మురళి
98499 98087

ఏడు దశాబ్దాల తర్వాత కూడా వివిధ వర్గాల నుంచి రిజర్వేషన్లపై డిమాండ్లు వినిపించడమంటే రిజర్వేషన్ల వల్ల ఆశించిన ప్రయోజనం సిద్ధించనట్టే. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తొలుత పదేండ్ల పాటు రిజర్వేషన్లు అమలుచేస్తే సమాజంలో అంతరాలు తగ్గిపోతాయని భావించారు. ఏడు దశాబ్దాల తర్వాత సగర్వంగా ఈడబ్ల్యూఎస్ అంటూ ఇతర వర్గాలకు కూడా రిజర్వేషన్ల అమలును సగర్వంగా ప్రకటించుకుంటున్నామంటే మనం వెనక్కు వెళ్తున్నామా? ముందుకు వెళ్తున్నామా? అనే అనుమానం కలుగుతున్నది.



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చినరోజు, ఆ తర్వాత చాలామంది మిత్రులతో జరిగిన సంభాషణలో 'దళితబంధు' ప్రస్తావన వచ్చింది. ఒక రాజకీయ పక్షం ఓటమికి, గెలుపునకు అనేక కారణాలుంటాయి. అనేక అంశాల ఆధారంగా ఓటరు నిర్ణయం తీసుకుంటారు. ఈ కారణం వల్లనే ఓటమి, ఈ కారణం వల్లనే గెలుపు అని ఎవరికి వారు విశ్లేషణ చేయడం సహజం. అయితే ఓటరు కేవలం తనకు నచ్చిన పార్టీకి ఓటు వేస్తాడు తప్ప బ్యాలెట్ బాక్స్‌లో ఓటరు ఈ కారణం వల్ల ఒక పార్టీని గెలిపించాడు, ఒక పార్టీని ఓడించినాడనే కారణాలు ఉండవు. ఫలితాల తర్వాత ఎవరి విశ్లేషణ వారిది.

> 'దళితబంధు' మీద ఆసక్తితో చాలామంది నుంచి ఈ పథకం గురించి అభిప్రాయాలు విన్నాను. పదేండ్లలో సమాజంలో మార్పు వస్తుందని అంబేద్కర్ ఆశిస్తే, 70 ఏండ్ల తర్వాత కూడా రిజర్వేషన్ల అవసరం ఉన్నదంటే ఆశించిన స్థాయిలో మార్పు రాలేదు. మార్పు అసలే రాలేదని చెప్పలేం కానీ, ఆశించిన స్థాయిలో అంతరాలు తగ్గిపోలేదు. ముస్లింల స్థితిగతులపై కమిషన్ ఏర్పాటు చేసినట్టు షెడ్యూల్డ్ కులాలపై కూడా అధ్యయనం చేసేందుకు కమిషన్‌ను నియమిస్తే దేశవ్యాప్తంగా వారి స్థితిగతులు ఎలా ఉన్నాయో తెలుస్తుంది.

దేశమంతా అధ్యయనం సంగతి ఎలా ఉన్నా కొన్ని గ్రామాలకు వెళ్లి చూస్తే తెలుస్తుంది. కొంతమందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించి వారి కుటుంబ స్థితిగతులు మారాయి. కానీ, ఎక్కువ మంది గ్రామీణుల స్థితి సగటు కన్నా తక్కువగానే ఉన్నది. షెడ్యూల్డ్ కులాలలో రిజర్వేషన్ల వల్ల ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదనే భావనతో కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉద్దేశం మంచిది. ఏ ప్రభుత్వం అయినా ప్రజలకు మేలు చేయడం ద్వారా వారి మద్దతుతో తిరిగి అధికారంలోకి రావాలని కోరుకుంటుంది. ఇందిరాగాంధీ కాలం నుంచి నేటివరకు ఏ పథకం లక్ష్యమైనా ఆ వర్గానికి మేలు చేయడంతోపాటు, ఆ మేలు వల్ల తమ పార్టీకి ప్రయోజనం కలగాలని కోరుకుంటారు. కానీ ఒక పథకం ప్రారంభించి, నిధులు వెచ్చించి భారీ వ్యతిరేకత కొని తెచ్చుకున్న పథకం దళితబంధు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఈ పథకం గురించి చాలామందితో మాట్లాడినప్పుడు కలిగిన అభిప్రాయం.

రాజకీయ నాయకులు, మేధావులు ఎవరైనా మైకుల ముందు దళితుల పట్ల చూపించేంత ప్రేమ వాస్తవంలో ఉండదు. పైగా వ్యతిరేకత ఉంటుంది. అందరూ అని చెప్పలేం కానీ, చాలామంది పైకి వ్యక్తం చేయరు కానీ వ్యతిరేకత ఉంటుంది. దళితులందరూ చదువుకొని ఉద్యోగాలు చేయలేరు. చదువుకున్నవారైతే ఉద్యోగాలు పొందేందుకు రిజర్వేషన్లు ఉపయోగపడొచ్చు. కానీ, వీరి సంఖ్య కన్నా గ్రామాల్లో, పట్టణాల్లో ఏదో ఒక పని చేసుకొని జీవించేవారే ఎక్కువ. కులం పేరుతో వీరు గతంలో వివక్షకు గురైనా వీరికేం రిజర్వేషన్ల ఫలాలుండవు. ఇలాంటి వారు కూడా అభివృద్ధి చెందేందుకు కేసీఆర్ ప్రభుత్వం 'దళిత బంధు' పథకాన్ని తీసుకువచ్చింది. పథకం ఉద్దేశం మంచిదే. దీనిద్వారా ఆ వర్గాలు ప్రయోజనం పొందడంతో పాటు తమ పార్టీకి కూడా ప్రయోజనం కలుగుతుందని ఆశించింది. కానీ, ఆచరణకు వచ్చేసరికి వ్యతిరేక ఫలితాలను ఇచ్చింది 'దళితబంధు' పథకం.

నిజానికి ఇదిప్పుడే బయటపడ్డ విషయమేమీ కాదు. హుజురాబాద్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థి ఓడిపోయి, బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలిచినప్పుడే ఈ విషయం బయటపడింది. 'దళితబంధు' అమలుచేసిన గ్రామాల్లో కూడా బీజేపీకి మెజారిటీ వచ్చిందని అప్పుడు వార్తలు కూడా వచ్చాయి. ఉప ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత, దళితబంధు వ్యతిరేక ప్రభావం చూపుతుందని గ్రహించి ఈ పథకం అమలును నిలిపివేస్తారనిపించింది. నిలిపివేస్తే రాజకీయంగా ప్రయోజనం కలిగేదేమో. కానీ, మరింత ఉధృతంగా అమలుచేశారు. ఇందిరాగాంధీ హయాం నుంచి షెడ్యూల్డ్ కులాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండేవి. ఇతర పార్టీలు అన్నీ కూడా కాంగ్రెస్ నుంచి ఆ వర్గాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి తమ తమ స్థాయిలో తీవ్రంగా ప్రయత్నించాయి. షెడ్యూల్డ్ కులాల్లోని రెండు కులాలను రెండుగా విభజించి ఒక కులాన్ని తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ఎన్టీఆర్ హయాం నుంచి ప్రయత్నాలు జరిగాయి. మాలలు కాంగ్రెస్ వైపు ఉన్నారని ఎన్టీఆర్ మాదిగ వర్గాన్ని తమ పార్టీ వైపు వచ్చేట్టు చేశారు. తర్వాత చంద్రబాబు రిజర్వేషన్ల వర్గీకరణ అమలుచేసి మాదిగలను తమ పార్టీకి అనుకూలంగా మార్చుకున్నారు. సుప్రీంకోర్టు కొట్టివేయడంతో వర్గీకరణ మళ్లీ మొదటికొచ్చింది. ఎం.వెంకయ్యనాయుడు శాసనసభ్యునిగా ఉన్నకాలం నుంచి బీజేపీ వర్గీకరణకు మద్దతుగా నిలిచింది. ఏకంగా మందకృష్ణ నాయకత్వంలో వర్గీకరణ కోసం ఉద్యమి స్తామని ప్రధాని మోదీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బహిరంగసభలోనే ప్రకటించారు. తెలంగాణలో వీరిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ ప్రయత్నం.

> 'దళితబంధు' ద్వారా షెడ్యూల్డ్ కులాల్లో అందరి మద్దతు పొందుతామని బీఆర్‌ఎస్ ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. కానీ, ఎన్నికల్లో వ్యతిరేక ఫలితాన్ని పొందింది. మహానగరంలో పక్కింటివారి పేరు తెలియదు. అపార్ట్‌మెంట్‌లో ఒకరి గురించి ఇంకొకరికి తెలియదు. ఎవరి జీవితం వారిది. పక్కింటి వ్యక్తి కోటి సంపాదించినా ఐతే నాకేంటి అనుకుంటాం. కానీ, గ్రామాల్లో పరిస్థితి అలా ఉండదు. అప్పటివరకు పేదరికంలో బతికిన కుటుంబానికి ఒక్కసారిగా 'దళితబంధు' కింద 10 లక్షలు వస్తే తేలిగ్గా తీసుకోరు.

ఓ గ్రామంలో ఉదాహరణకు వెయ్యి కుటుంబాలున్నాయనుకుంటే.. ఐదు కుటుంబాలకు 'దళిత బంధు' ఇస్తే మిగిలినవారిలో వ్యతిరేక ప్రభావం చూపుతుంది. పోనీ గ్రామంలో ఉన్న దళిత కుటుంబాలన్నీ సానుకూలంగా స్పందిస్తాయా? అంటే ఫలితాలు చూస్తే అలా కనిపించడం లేదు. వారికే ఇచ్చారని మిగిలిన కులాల్లో వ్యతిరేకత. ఐదు కుటుంబాలకే ఇచ్చారని షెడ్యూల్డ్ కులాల్లోని ఇతర కుటుంబాల్లో వ్యతిరేకత.

మరోవైపు 'దళితబంధును తమవారికే కేటాయించుకున్నారని, అవినీతికి పాల్పడ్డార'నే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఫలితాలు వచ్చినరోజు... 'మాకేమో జీతాలు ఆలస్యంగా ఇస్తూ బంధులు అంటూ డబ్బులు పంచిపెట్టారు, వ్యతిరేకంగా ఓటు వేయకుండా ఎందుకుంటాం' అంటూ ప్రభుత్వ ఉద్యోగులు మార్నింగ్ వాక్‌లో కామెంట్. మొత్తం మీద భారీ ఎత్తున నిధులు కేటాయించి వ్యతిరేకత కొనితెచ్చుకున్నారు. ఎవరికీ ఇవ్వకపోయినా ఏమీ కాదు. కానీ, ఐదుగురికి ఇస్తే మిగిలిన 95 మందిలో వ్యతిరేకత వస్తుంది. ఇది మనిషి సహజ గుణం.

**దళితబంధు సక్రమంగా అమలుచేస్తే సమాజంలో మార్పు తీసుకువచ్చేదేమో కానీ, రాజకీయంగా నష్టం కలిగించి తీరుతుంది. ఇప్పుడైనా ఎప్పుడైనా... ఎందుకంటే మనుషులకు మైకుల ముందు మాట్లాడేంత విశాల హృదయం ఉండదు.**

(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

# మూడింతలు 'అణు'సరనీయమా?



సూరి

ప్రపంచవ్యాప్తంగా విద్యుత్తు కొరతకు చెక్ పెట్టేందుకు పలు దేశాలు నడుం బిగించాయి. అతి చౌకగా లభించే అణు విద్యుత్తు సామర్థ్యాన్ని మూడింతలు పెంచాలని ఆయా దేశాలు నిర్ణయించాయి. దుబాయి వేదికగా జరిగిన 28వ ఐక్యరాజ్య సమితి క్లైమేట్ చేంజ్ కాన్ఫరెన్స్ (సీవోపీ 28వ సదస్సు)లో ఈ మేరకు 20కి పైగా దేశాలు ప్రతిజ్ఞ చేశాయి.



ఐరోపా, ఉత్తర అమెరికాకు చెందిన పలు దేశాలు 2050 నాటికి తమ అణు విద్యుత్తు సామర్థ్యాన్ని భారీగా పెంచుకునేందుకు సమాయత్తం అవుతున్నాయి. రానున్న 25 ఏండ్లలో ప్రపంచ విద్యుత్తు అవసరాలలో ప్రస్తుతం 10 శాతంగా ఉన్న అణు విద్యుత్తును భారీగా పెంచేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్, కెనడా, ఫ్రాన్స్, ఘనా, దక్షిణ కొరియా, స్వీడన్, యూఏఈ తదితర దేశాలు ఈ మేరకు అంగీకారం తెలిపాయి.

పారిస్ ఒప్పందం ప్రకారం ప్రపంచ సగటు ఉష్ణోగ్రతను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడానికి అవసరమైన మార్గాలను అనుసరించేందుకు సీవోపీ 28వ సదస్సు దోహదం చేసింది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు జరిగిన ఈ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన సుమారు 70 వేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. కర్బన ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో పలు ఒప్పందాలు జరిగాయి. అయితే పారిస్ ఒప్పందం దిశగా అడుగులు పడటం లేదని సీవోపీ 28వ సదస్సు అధ్యక్షుడు సుల్తాన్ అల్ జబేర్ విచారం వ్యక్తం చేయడం గమనార్హం.

అణు విద్యుత్తు శక్తి లేకుండా కర్బన ఉద్గారాలను నెట్ జీరోకు తీసుకురావాలన్న లక్ష్యాన్ని చేరుకోలేమని భావిస్తున్న ఐరోపా, ఉత్తర అమెరికా దేశాలు పలు లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. ప్రస్తుతం ఉన్న అణు రియాక్టర్ల జీవితకాలాన్ని 80 ఏండ్లకు పెంచడం అందులో ఒకటి. దీంతో పాటు కొత్తగా పెద్ద రియాక్టర్లు, అడ్వాన్స్‌డ్ స్మాల్ మాడ్యూలర్ రియాక్టర్లను నిర్మించాలని నిర్ణయించాయి.


> అయితే ఆయా దేశాలు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం అంత సులువు కాదు. అణు విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి పర్యావరణ అనుమతులు తప్పనిసరి. అదే సమయంలో ఆర్థిక వనరులు సమకూర్చడం కూడా ఆయా దేశాలకు తలకు మించిన భారమే. అణు శక్తి చౌకగా లభిస్తున్నప్పటికీ అణు విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వీటి నిర్మాణం కూడా అనుకున్నంత వేగంగా సాగకపోవడం మరో ప్రతికూలత.

పునరుత్పాదక ఇంధన వనరులైన పవన, సౌర విద్యుత్తు నిరంతరం మనకు కరెంటును అందించలేవు. అణు విద్యుత్తు వాటికి ప్రత్యామ్నాయమని న్యూక్లియర్ పవర్ మద్దతుదారులు వాదిస్తున్నారు. అయితే పర్యావరణవేత్తలు వారి వాదనను కొట్టిపారేస్తున్నారు. అణు విద్యుత్తు కంటే పవన, సౌర విద్యుత్తు ఎంతో చౌకగా లభిస్తున్నదని, అదే సమయంలో పర్యావరణానికి ఎటువంటి హాని చేయవని వారు చెప్తున్నారు. ఒకవేళ అణు ధార్మిక పదార్థాలు లీక్ అయితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. 2011లో జరిగిన పుకుషిమా ఘటనను వారు గుర్తు చేస్తున్నారు. పర్యావరణవేత్తల ఆందోళనను కొట్టిపారేయలేం. అనుకోని ఘటన జరిగితే భారీ నష్టం సంభవించే ప్రమాదం ఉన్నది. కానీ, రేడియో ధార్మిక పదార్థాల నిర్వహణపై కూడా ప్రస్తుత సదస్సులో చర్చించడం హర్షించదగిన విషయం.

అమెరికా విద్యుత్తు అవసరాలలో 18 శాతం అణు శక్తి తీరుస్తున్నది. అమెరికా సహా అనేక ఐరోపా దేశాలు అణు విద్యుత్తు వైపు అడుగులు వేస్తున్నాయి. ఆయిల్, గ్యాస్ తదితర అవసరాల కోసం ఐరోపా దేశాలు రష్యాపై అతిగా ఆధారపడుతున్నాయి. ఇంధనం కోసం భారీగా ఖర్చు పెట్టాల్సి వస్తున్నది. దీంతో ఈ రంగంపై ఎక్కువ పెట్టుబడులు అవసరం అవుతున్నాయి. దీన్ని అధిగమించేందుకు రష్యాపై ఆధారపడకుండా ఉండేందుకు గానూ ఐరోపా దేశాలు అణు విద్యుత్తు దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తున్నది. అయితే ఈ అంశంలో ఫ్రాన్స్ అందరికంటే కాస్త ముందున్నది.

> ఆరు న్యూక్లియర్ రియాక్టర్లను నిర్మించాలని గతేడాది నిర్ణయించుకున్న ఫ్రాన్స్ వాటికి తోడు మరో ఎనిమిది రియాక్టర్లను నిర్మించాలని చూస్తుండటం ఈ రంగంలో ఆ దేశ దూకుడుకు నిదర్శనం. దేశ విద్యుత్తు అవసరాలలో ఫ్రాన్స్ సుమారు 70 శాతం అణు విద్యుత్తు ద్వారానే పొందుతున్నది. ఆ దేశ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మెక్రాన్ ఈ విషయంలో కాస్త దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అణు విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం కోసం ఆయన పెద్ద మొత్తంలో ఆర్థిక వనరులను సమకూరుస్తున్నారు.

మన భారతదేశం కూడా అణు విద్యుత్తు శక్తి దిశగా వడివడిగా అడుగులు వేస్తుండటం ముదావహం. దేశంలోని ఏడు న్యూక్లియర్ ప్లాంట్లలో 22 రియాక్టర్లు ఉన్నాయి. ఏటా అవి 6,780 మెగావాట్ల అణు విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నాయి. 2031 నాటికి ప్రస్తుతం ఉన్న సామర్థ్యాన్ని మూడింతలు పెంచి, 22,480 మెగావాట్లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇదిలా ఉంటే వీటి నిర్మాణానికి కావాల్సిన నిధులను సమకూర్చుకోవడమే దేశం ముందున్న అసలు సమస్య.





## భద్రతా వైఫల్యం చిన్న విషయమే



పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యం అనేది చాలా చిన్న విషయం. ప్రతిపక్షాలు దాన్ని పెద్దదిగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్ ఎంపీ ఇంట్లో రూ.400 కోట్ల అక్రమ నగదు దొరకడం అసలైన పెద్ద విషయం. దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఆ విషయాన్ని కప్పిపుచ్చేందుకు పార్లమెంట్ అంశాన్ని పెద్దదిగా చేసి చూపిస్తున్నారు.

- కైలాష్ విజయ్ వర్గీయ,
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి



# ప్లాస్టిక్‌తో పార్కిన్సన్

సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ అనేక ఆవిష్కరణలు వెలుగుచూస్తున్నాయి. ఇవి రెండు వైపులా పదునున్న కత్తి వలె మానవాళికి ప్రయోజనం చేకూరుస్తూనే ప్రమాదకారిగానూ పరిణమిస్తున్నాయి. 20వ శతాబ్దంలో ఆవిష్కరించిన ప్లాస్టిక్ కూడా ఆ కోవలోనిదే. నిత్య జీవితంలో భాగమైపోయిన ప్లాస్టిక్ రోజురోజుకు మానవాళి పట్ల ప్రాణాంతకంగా మారుతున్నది.

మానవుడి దైనందిన జీవితంలో ప్లాస్టిక్ భాగమైపోయింది. సాంకేతికత సాయంతో మనకు మరింతగా చేరువైన నానో ప్లాస్టిక్, మైక్రోప్లాస్టిక్ మన ప్రాణాలను హరిస్తున్నాయి. కంటికి కనిపించని పరిమాణంలో ఉండే ఇవి నీరు, ఆహారంలో కలిసిపోయి అక్కడి నుంచి మన శరీరంలోకి చేరుతున్నాయి. తాజాగా వెలుగుచూసిన ఓ పరిశోధనలో మన రక్తంలోనూ నానో ప్లాస్టిక్ ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. మెదడులోకి చొచ్చుకుపోయి నాడీ వ్యవస్థను ప్లాస్టిక్ దెబ్బతీస్తున్నట్టు అందులో తేలింది. అతి సూక్ష్మ రూపంలో ఉండే ఇవి రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి.

మెదడులోకి చొచ్చుకుపోయిన నానో ప్లాస్టిక్ పార్కిన్సన్ వ్యాధికి కారకమవుతుండటం ఆందోళన కలిగించే విషయం. వాతావరణంలో ఉండే నానో ప్లాస్టిక్ పదార్థాలు ఆల్ఫా సినుక్లిన్ అనే ప్రొటీన్‌తో సంకర్షణ జరుపుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్‌కు ఉపయోగపడే ఇవి క్రమంగా పార్కిన్సన్ వ్యాధిగా రూపాంతరం చెందేలా దోహదం చేస్తున్నాయి. పార్కిన్సన్ అనేది ప్రపంచవ్యాప్తంగా అతివేగంగా విస్తరిస్తున్న నాడీ సంబంధిత రుగ్మత. కదలికలను నియంత్రించే నాడీ కణాలను ఈ వ్యాధి నాశనం చేస్తుంది. దీనివల్ల క్రమంగా నాడీ వ్యవస్థ పని చేయడం మానేస్తుంది.

> ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2019లో ప్రపంచవ్యాప్తంగా 85 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్టు తేలింది. అయితే 25 ఏండ్లలో పార్కిన్సన్ బాధితుల సంఖ్య రెట్టింపు కావడం ఆందోళన కలిగించే విషయం. 2019 నాటికి పార్కిన్సన్ కారణంగా సుమారు 58 లక్షల మంది వైకల్యం బారినపడ్డారు. 2000తో పోలిస్తే ఇది 81 శాతం అధికం కావడం గమనార్హం. అదే సమయంలో మరణాలు కూడా భారీగా పెరిగాయి.

2019 నాటికి ఈ వ్యాధితో 3,29,000 మంది మృతి చెందారు. 2000తో పోలిస్తే 100 శాతం అధిక మరణాలు నమోదయ్యాయి. మన దేశంలోనూ పార్కిన్సన్‌తో బాధపడుతున్నవారు లక్షల మంది ఉన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే చైనాలో ఈ వ్యాధి బాధితులు ఎక్కువ మంది ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెప్తున్నాయి.

పార్కిన్సన్ వ్యాధి వేగంగా విస్తరిస్తున్నా.. ఆయా దేశాలు దీనిపై అంతగా దృష్టి సారించడం లేదు. అందుకే క్రమంగా ఈ వ్యాధి ప్రాణాంతకంగా మారుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం, చికిత్స అందకపోవడం తదితర కారణాల వల్ల అనేకమంది మృత్యువాతపడుతున్నారు. ముందుగానే వ్యాధిని గుర్తించకపోవడం, సరైన సమయంలో చికిత్స అందకపోవడం మరణాలకు కారణం. తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో న్యూరాలజిస్టులు చాలా తక్కువ సంఖ్యలో ఉండటం ఆందోళనకరం. ఈ దేశాల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 0.03 మంది న్యూరాలజిస్టులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అధిక ఆదాయం కలిగిన దేశాల్లో ప్రతి లక్ష మందికి 4.75 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు.

> యావత్ ప్రపంచంలో సమస్త మానవాళి అనారోగ్యం బారిన పడుతున్నా.. ప్లాస్టిక్ వాడకం తగ్గడం లేదు. ఏటా దీని వినియోగం పెరుగుతూనే ఉన్నది. హానికరమైన ఈ ప్లాస్టిక్‌ను ప్రభుత్వాలు నిషేధిస్తున్నట్టు ప్రకటనలు చేస్తూ చేతులు దులుపుకొంటున్నాయి.

సరైన రీతిలో చర్యలు చేపట్టకపోవడంతో ప్లాస్టిక్ పెనుభూతంగా మారుతున్నది. 2021 లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 400 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అయ్యింది. ఈ మొత్తం కొంతకాలానికి ప్లాస్టిక్ వ్యర్థాలుగా మారి వాతావరణంలో కలిసిపోయి మానవాళికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉన్నది.

- ఎడిటోరియల్ డెస్క్